# నోట్ల కట్టలు కాంగ్రెస్‌వే..

- ఎన్నికల్లో డబ్బునే నమ్ముకున్న కాంగ్రెస్
- హస్తం నాయకుల వద్ద లక్షల్లో స్వాధీనం
- రేవంత్ ప్రధాన అనుచరుడిపై కేసుతో తేటతెల్లం
- కాంగ్రెస్ తీరుపై మండిపడుతున్న సామాన్య జనం

నిజామాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి పట్టణంలో మంగళవారం గూడెం శ్రీనివాస్ రెడ్డి వద్ద లభ్యమైన మొత్తం డబ్బు అక్షరాల రూ. 56 లక్షల 84 వేలుగా ఎన్నికల అధికారులు, ఆదాయ పన్ను శాఖ లెక్క తేల్చారు. 500 నోట్లతో కూడిన 114 కట్టలను స్వాధీనం చేసుకున్నట్లుగా పోలీసులు వెల్లడించారు. నవంబర్ 29న జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు కామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో గూడెం శ్రీనివాస్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డబ్బు స్వాధీనం ప్రక్రియలో తనిఖీలు నిర్వహించిన వారిలో ఆదాయ పన్ను శాఖ అధికారి అభిషేక్ శుక్లా సైతం ఉన్నారు. లభ్యమైన మొత్తం డబ్బుకు సంబంధించిన వాటికి ఆధారాలను సమర్పించడంలో సదరు వ్యక్తి విఫలమయ్యారు. ఇంత పెద్ద మొత్తంలో నోట్ల కట్టలను రియల్‌ఎస్టేట్ కంపెనీలో దాచడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించగా.. తలా తోక లేని సమాధానాలు ఇచ్చినట్లుగా తెలిసింది. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకే డబ్బులు తీసుకువచ్చినట్లుగా అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో నోట్ల కట్టలు ఏ విధంగా కామారెడ్డికి చేరుకున్నాయనే కోణంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు వివరాలు రాబడుతున్నారు. ఎన్నికల్లో ప్రజల మద్దతును కోరాల్సిన కాంగ్రెస్ పార్టీ.. దొడ్డిదారిలో డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం ఏమిటని జనం ప్రశ్నిస్తున్నారు.

**ఆది నుంచి అడ్డదారే...**

కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నట్లుగా ప్రకటించడంతో ఆ పార్టీకి చెందిన షబ్బీర్ అలీ కంగుతిన్నారు. అప్పటివరకు తొడలు కొట్టిన కీలక నేతనే ఓటమిని అంగీకరించి పలాయనం చిత్తగించారు. పరువును నిలబెట్టుకునే క్రమంలో షబ్బీర్ స్థానంలో అభ్యర్థిత్వం ఖరారు చేసుకున్న పీసీసీ చీఫ్.. ఇక్కడి నుంచి పోటీకి దిగారు. ప్రజల మద్దతు ఇసుమంతైనా లేనటువంటి కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులు దాపురించడంతో కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు రేవంత్ దొడ్డిదారిని వెతుక్కున్నాడు. ఇందులో భాగంగానే కొడంగల్ బ్యాచ్‌ను రంగంలోకి దించి బీఆర్ఎస్ లీడర్లను కొనడానికి ప్రయత్నించారు. ఇలా కొంతమందిని ఎర వేసి, కండువా మార్చినప్పటికీ క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీ చెక్కు చెదరలేదు. గులాబీ సైనికులు మాత్రం కేసీఆర్ కోసం విశేషంగా కృషి చేయడంతో కేటీఆర్ కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సైతం సక్సెస్ అయ్యింది. ఆ తర్వాత కాంగ్రెస్ నిర్వహించిన బీసీ డిక్లరేషన్, రేవంత్‌రెడ్డి రోడ్ షోలకు అంతగా స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి పరిస్థితులు మింగుడు పడలేదు. దీంతో ఎలాగైనా ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టాలని కుట్రలకు దిగి, ఇష్టానుసారంగా వ్యవహరించడానికి హస్తం పార్టీ స్కెచ్ వేసింది. ఇందులో భాగంగానే డబ్బు సంచులను డంప్ చేసి ప్రలోభాల పర్వానికి తెరలేపింది.

**ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న కాంగ్రెస్...**

కామారెడ్డి నియోజకవర్గంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వర్గీయులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకే తిలోదాకలిస్తూ ఈసీ వ్యవస్థకే సవాల్ విసురుతున్నారు. నాన్ లోకల్ వ్యక్తులు ప్రచారం ముగిసిన తర్వాత కామారెడ్డిలో ఉండకూడదని రూల్ ఉన్నప్పటికీ లెక్క చేయకుండా కామారెడ్డిలోనే రేవంత్ మనుషులు తిష్ట వేసుకొని ఉన్నారు. దొడ్డి దారుల్లో గుర్తింపు కార్డులను దక్కించుకున్న వ్యక్తులు.. తలోదారిలో తల దాచుకుని ప్రజలను డబ్బుతో కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్‌పై పోటీకి దిగిన రేవంత్‌రెడ్డి ప్రజల మనసులను కొల్లగొట్టి గెలవాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా ఓటర్లను డబ్బులతో కొనుగోలు చేస్తూ వికృత చేష్టలకు తెరలేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రేవంత్‌రెడ్డి అనుచరుడిగా పేరొందిన గూడెం శ్రీనివాస్‌రెడ్డి వద్ద నోట్ల కట్టలు బయటపడ్డాయి. కామారెడ్డి పట్టణంలోని జీవదాన్ స్కూల్ వద్ద ఉన్న రియల్‌ఎస్టేట్ ఆఫీసు అడ్డాగా చేసుకొని, ఈ అక్రమ తంతును నడుపుతుండగా పలువురు గుర్తించారు. వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయగా దాడులు నిర్వహించారు. ఇందులో నోట్ల కట్టలు బయట పడడంతో అవాక్కైన ఎన్నికల అధికారులు.. వెంటనే ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇచ్చారు. లెక్కా పత్రాలను తేల్చిన తర్వాత ఈ మొత్తం అక్రమంగానే తీసుకువచ్చిన సొమ్ము కింద భావించి బుధవారం కేసు నమోదు చేయడంతో వీరి వ్యవహారం తేటతెల్లమైంది.

## బీఆర్ఎస్‌లో చేరిక

చందూర్, నవంబర్ 29 : చందూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో బుధవారం 20 మంది చేరారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్యారం అశోక్, పోచారం స్నేహితుడు దుర్కి పోశెట్టి, సాయారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగం

కోటగిరి, నవంబర్ 29 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి కోటగిరి మండలంలో 80 ఏండ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కోటగిరి, పొతంగల్ మండలాల తహసీల్దార్లు ప్రభాకర్, రమేశ్ బుధవారం తెలిపారు. కోటగిరి మండలంలో 91 మందిలో వృద్ధులు 43 మంది, దివ్యాంగులు 48 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రభాకర్ తెలిపారు. పొతంగల్ మండలంలో 76 మందిలో వృద్ధులు 52 మంది, దివ్యాంగులు 24 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ రమేశ్ తెలిపారు.

## ఉమ్మడి కోటగిరి మండలంలో భారీ వర్షం

కోటగిరి, నవంబర్ 29 : ఉమ్మడి కోటగిరి మండలంలోని పొతంగల్, సోంపూర్, టాక్లీ, యాద్గార్‌పూర్, వల్లభాపూర్, దోమలెడ్గితోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం భారీ ఈదురుగాలులు వీచాయి. రాత్రి 9 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. పలు చోట్ల వడగండ్ల వాన కురిసింది. కోటగిరి మండలంలో 47 మి.మీ, పొతంగల్ మండలంలో 61.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

# రూ.56 లక్షల 84 వేలు సీజ్

కామారెడ్డి, నవంబర్ 29 : జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్ సమీపంలో పంచుతున్న డబ్బులు రూ.56 లక్షల 84 వేలు సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్ ఎదురుగా ఉన్న ఓ టైర్ షాప్ వద్ద డబ్బులు పంచుతున్నారని అందిన సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఆ షాపు బయట కాంగ్రెస్ నాయకుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, అతని అనుచరులు కొందరు ఉన్నారు. గూడెం శ్రీనివాస్‌రెడ్డి దగ్గర ఒక బ్యాగ్ కనబడగా ఎఫ్ఎస్‌టీ సభ్యులు ఆ బ్యాగును తనిఖీ చేశారు. అందులో 500 రూపాయల నోట్ల కట్టలు ఉన్నాయి. వెంటనే ఎఫ్ఎస్‌టీ సభ్యులు ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్లకు తెలియజేశారు. ఇన్‌కమ్ టాక్స్ అధికారి అభిషేక్ శుక్లా అక్కడికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించి అందులో ఉన్న 500 నోట్ల కట్టలు మొత్తం లెక్కించి చూడగా అవి రూ.58 లక్షల 84 వేలు ఉన్నాయి. ఆ డబ్బులను సీజ్ చేసి తగు చర్య నిమిత్తం బుధవారం కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గూడెం శ్రీనివాస్‌రెడ్డి, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులపై కేసు

- బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలో నిజం లేదు
- సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి

బాన్సువాడ, నవంబర్ 29 : బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులపై కేసు పెట్టారని, లేని పోని అంశాలను జోడించి ఓట్లు రాబట్టుకోవాలన్న దురుద్దేశంతోనే ఫిర్యాదు చేశారని రైతు బంధు సమితి కామారెడ్డి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి విమర్శించారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బాన్సువాడలోని లింగాల రవీందర్‌రెడ్డి ఇంటి పక్కన కొందరు వ్యక్తులు ఉండడం, బీఆర్ఎస్ నాయకులు అటు వైపు వెళ్లగా వారు ఇతర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతర ప్రాంతం వారు డబ్బులతో ఉండడం, బీఆర్ఎస్ నాయకులను గమనించి పారిపోయేందుకు యత్నించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు వారి వెంట వెళ్లగా దాడి చేసే ప్రయత్నం చేశారని వివరించారు. వారి అక్రమాలను కప్పిపెట్టుకునేందుకే పోచారం భాస్కర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, హన్‌మాన్ వ్యాయామశాల అధ్యక్షుడు గురు వినయ్‌కుమార్, మహ్మద్ ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



బస్సులో పోలింగ్‌కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

**రూరల్ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం**

డిచ్‌పల్లి/ ఇందల్వాయి / ధర్పల్లి/ జక్రాన్‌పల్లి, నవంబర్ 29 : నేటి (గురువారం) ఉదయం నిర్వహించే పోలింగ్ ప్రక్రియకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 2 లక్షల 53 వేల 233 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ఇందుకు గాను నియోజకవర్గంలోని ఏడు మండలాలకు 293 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్‌కు సంబంధించిన పూర్తి సామగ్రిని బుధవారం ఎన్నికల సిబ్బందికి అందజేసి, ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలంలో 47 పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశామని, 19,991 మంది పురుషులు, 21,975 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మోపాల్ మండలంలోని 43 పోలింగ్‌కేంద్రాల్లో 17,600 పురుషులు, 20,144 మహిళలు, డిచ్‌పల్లి మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో 21,201 పురుషులు, 24,363 మహిళలు ఒక ట్రాన్స్‌జెండర్, ఇందల్వాయిలో 39 పోలింగ్‌స్టేషన్లలో 13,897 పురుషులు, 15,970 మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు, జక్రాన్‌పల్లి మండలంలో 37 పోలింగ్‌స్టేషన్లలో 15,744 పురుషులు, 18,252 మంది మహిళలు, ధర్పల్లిలో 35 పోలింగ్‌స్టేషన్లలో 14,653 మంది పురుషులు, 16,716 మహిళలు, సిరికొండలో 43 పోలింగ్‌కేంద్రాల్లో 15,551 మంది పురుషులు, 17,191 మహిళలు.. మొత్తం 293 పోలింగ్‌కేంద్రాల పరిధిలో పురుషులు 1,18,627, మహిళలు 1,34,601 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 15 వేల 974 మంది అధికంగా ఉండడం విశేషం. అభ్యర్థుల దృష్టి మహిళా ఓటర్లపైనే ఉన్నది.



సిబ్బంది సందేహాలను నివృత్తి చేస్తున్న అధికారులు

ఇందల్వాయి మండలంలో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, అర్హులు ఓటు హక్కును తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ధర్పల్లి ఎంపీడీవో లక్ష్మణ్, తహసీల్దార్ మాలతి సూచించారు. జక్రాన్‌పల్లిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల అధికారులు, సిబ్బంది తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.